క్లుప్తంగా

గణిత మేధావి శకుంతలాదేవి

సోమశిల: గణిత మేధావి శకుంతలాదేవి వర్ధంతిని చిలకలమర్రి జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. శకుంతలాదేవి చిత్రపటానికి హెచ్‌ఎం సురేష్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శకుంతలాదేవి అత్యంత వేగంగా అంక గణిత గణనలు చేసి హ్యూమన్ కంప్యూటర్‌గా పేరు తెచ్చుకోవడంతో పాటు గిన్నిస్ బుక్ రికార్డును సాధించారని తెలిపారు. ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, మహేష్, వెంకటశ్వర్లు, రమణరాజు, మదీనా, మాధవి, సురేష్, పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గ్రామోత్సవం



అల్లూరు: అల్లూరుపేటసత్రంలో గంగమ్మ, మహాలక్ష్మమ్మ తిరునాళ్లలో భాగంగా గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. గంగమ్మ, మహాలక్ష్మమ్మను విశేషంగా అలంకరించి ప్రత్యేక వాహనాలపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. ఆదివారం అర్ధరాత్రి మొదలైన గ్రామోత్సవం సోమవారం మధ్యాహ్నం వరకు సాగింది.

ఈకేవైసీ వేగవంతం

ఆత్మకూరు(చేజర్ల): రేషన్‌కార్డుదారుల ఈకేవైసీ ప్రక్రియను వేగవంతం చేయాలని చేజర్ల తహసీల్దార్ బీ మురళి అన్నారు. చేజర్ల తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లు, వీఆర్వోలతో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. మండలంలో 29,678 మంది రేషన్‌లబ్ధిదారులు ఉండగా, ఇంకా 2283 మందికి సంబంధించి ఈకేవైసీ పెండింగ్‌లో ఉందన్నారు. రేషన్ డీలర్లు, వీఆర్వోలు చొరవ చూపి ఈకేవైసీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సివిల్ సప్లయిస్ డీటీ ఐ రవి పాల్గొన్నారు.

మా భూములను పరిశ్రమలకు అప్పగించొద్దు



దుత్తలూరు: దశాబ్దాల క్రితం తమ కుటుంబాలకు ప్రభుత్వం అందజేసిన భూములను పరిశ్రమలకు అప్పగించొద్దని దుత్తలూరు ఏఏకాలనీ వాసులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ యనమల నాగరాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం యాభై ఏళ్ల క్రితం దుత్తలూరు రెవెన్యూ పరిధిలోని బ్రహ్మేశ్వరం సమీపంలో సీజేఎఫ్ఎస్ స్కీం కింద 53 కుటుంబాలకు 156 ఎకరాలను కేటాయించిందని తెలిపారు. ఇటీవల సదరు భూమిని పరిశ్రమల కోసం సర్వే చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, తమ భూములను అప్పగించొద్దని కోరారు. అలాగే పట్టాదారు పాస్‌పుస్తకాలను తమ వారసులకు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన తహసీల్దార్ కలెక్టర్ దృష్టికి అర్జీ రూపంలో తీసుకెళ్లాలని సూచించారు.

క్షయ పరీక్షలు

సంగం: జిల్లా కుష్టు, క్షయ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ ఆదేశాల మేరకు సంగం పీహెచ్‌సీ పరిధిలోని క్షయ బాధితుల కుటుంబ సభ్యులకు వైద్యాధికారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం క్షయ పరీక్షలు నిర్వహించారు. ఎడమ చేయి మోచేయి కింద భాగాన రెండు చర్మపు పొరల మధ్యన క్షయకు కారణమయ్యే బ్యాక్టీరియాను గుర్తించే పరీక్షలు చేశారు. నోటి తుంపర్ల ద్వారా క్షయ వ్యాధి వ్యాప్తి చెందుతుందని, ముందస్తుగా గుర్తించి తగిన మందులు వాడడం ద్వారా అరికట్టవచ్చునని వైద్యాధికారి తెలిపారు.

ట్రాన్స్‌మిషన్ తరగతుల పరిశీలన

ఉదయగిరి: మండలంలోని అప్పసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈఓ-2 తోట శ్రీనివాసులు సోమవారం సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న ట్రాన్స్‌మిషన్ తరగతులను పరిశీలించారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. సోమవారం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ఒక తరగతి నుంచి మరో తరగతికి ప్రమోట్ చేసి ఆయా తరగతి గదుల్లో ప్రవేశం కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు గేయాలు, పద్యాలు పాడడం, కథలు చెప్పడం, తదితర అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మేళ్లచెరువుకు పురస్కారం

ఆత్మకూరు: పట్టణానికి చెందిన రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఉపాధ్యక్షుడు, సీమా బ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు మేళ్లచెరువు శివకుమారశర్మ స్మార్ట్‌గురు పురస్కారాన్ని అందుకున్నారు. ఆదివారం రాత్రి సింహాచలం పుణ్యక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో విశాఖపట్నానికి చెందిన ఎస్ఎస్ లైవ్ ఆస్ట్రో ప్రైవేట్ లిమిటెడ్, ఆర్యన్ ఆస్ట్రాలజీ రీసెర్చ్ సెంటర్ వారు పురస్కారాన్ని అందజేసి సత్కరించారు. శివకుమారశర్మ అర్చక వృత్తి పరంగా, సామాజిక పరంగా చేస్తున్న సేవలను గుర్తించి అవార్డును అందజేసినట్లుగా నిర్వాహకులు తెలిపారు.

ఔషధ గుణం.. ఆరోగ్యప్రదం

- తాటి ముంజల్లో పుష్కలంగా విటమిన్లు
- ఐస్ యాపిల్‌గా ప్రాచుర్యం



తాటిముంజలు



తాటి ముంజలు తింటూ సేద తీరుతున్న ఓ కుటుంబం

సీతారామపురం : వేసవి కాలం వస్తే అమ్మో అంటాం కానీ అది తీసుకొచ్చే రుచులను మాత్రం లొట్టలేసుకుంటూ ఆస్వాదిస్తాం. మామిడి పండ్లు, తాటికాయలు, చెరుకురసం, కర్బూజ, పుచ్చకాయ..ఇలా ఆస్వాదించేందుకు చాలా ఉంటాయి. వేసవిలో భానుడి ప్రతాపంతో ప్రజలు శరీరానికి చలువ చేసే పదార్థాలను ఎక్కువగా తీసుకుంటుంటారు. శరీరం డీహైడ్రేషన్‌కు గురై వడదెబ్బ బారిన పడకుండా మజ్జిగ, కొబ్బరి బొండాలు, పుచ్చకాయలు, పండ్ల రసాలు, తాటిముంజలు వంటివి ఎక్కువగా తీసుకుంటూ ఉపశమనాన్ని పొందుతుంటారు. అయితే వేసవిలో ప్రత్యేకంగా లభించే తాటి ముంజలకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ప్రకృతి ప్రసాదించిన ఇవి వేసవితాపాన్ని తీర్చడంతో పాటు వేసవిలో శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారించే సుగుణాలను కలిగి ఐస్‌యాపిల్‌గానూ ప్రాచుర్యం పొందాయి. పల్లెల్లో విరివిగా లభియయ్యే తాటి ముంజలు కల్తీ లేనివి, స్వచ్ఛమైనవి కావడంతో ఆరోగ్య ప్రదాయిని అని వైద్యులు కూడా చెబుతున్నారు. వేసవిలో శరీరంలో చక్కెర, ఖనిజ లవణాల ప్రమాణాలను సమతుల్యం చేసే లక్షణాన్ని కలిగి ఉండే వీటికి వేసవి సీజన్ ప్రారంభంతో డిమాండ్ ఏర్పడింది. గతంలో గ్రామీణ ప్రాంతాల్లో తాటిచెట్లు అధికంగా ఉండేవి. కల్పవృక్షమైన తాటిచెట్లను పొలాల గట్లపై ప్రత్యేకంగా పెంచేవారు. కొన్ని గ్రామాల్లో ప్రత్యేకంగా తాటితోపులే ఉండేవి. కాలక్రమంలో కోతుల బెడద కారణంగా పొలాల్లో, పూరిల్లు తగ్గిపోవడం..రియల్ ఎస్టేట్ కారణంగా మారుమూల గ్రామాల్లో సైతం తాటిచెట్లను నరికేస్తున్నారు. దీంతో క్రమంగా తాటి చెట్లు కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. తాటిచెట్లు ఉన్నా కాయలను దింపే వారు తగ్గిపోవడంతో తాటిముంజలకు డిమాండ్ ఏర్పడింది.

అనేక ప్రయోజనాలు

తాటిముంజల్లో విటమిన్లు, పాస్ఫరస్ థయామిన్, బీ కాంప్లెక్స్, కాల్షియం, పొటాషియంతో పాటు సోలెబుల్ ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటిలో నీటి శాతం ఎక్కువగా ఉండడం వల్ల డీహైడ్రేషన్ నుంచి ఉపశమనం కలిగిస్తాయి. వేసవి తాపం, వడదెబ్బ నుంచి రక్షణ కల్పిస్తాయి. శరీరంలోని హానికర వ్యర్థ పదార్థాలను బయటకు పంపడంతో పాటు రక్తపోటును అదుపులో ఉంచుతాయి. వేసవిలో ఏటా క్రమం తప్పకుండా తాటి ముంజలు తినడం ద్వారా చెడు కొలెస్ట్రాల్ తగ్గి మంచి కొలెస్ట్రాల్ వృద్ధి చెందుతుంది. వేసవిలో వచ్చే చికెన్ ఫాక్స్‌ను నివారించి శరీరాన్ని చల్లగా ఉంచుతాయి. చర్మానికి కావాల్సినంత తేమను అందించి చెమటకాయలను నివారిస్తాయి.

పోషక విలువలు అధికం



వేసవిలో ఎండలు అధికంగా ఉండడం వల్ల మనిషి శరీరంలో నీటిని, లవణాలను కోల్పోతాడు. అందువల్ల శరీరానికి కావాల్సిన పోషకాలను ఎప్పటికప్పుడు అందిస్తుండాలి. తాటి ముంజలు వేసవి తాపాన్ని తీర్చడంతో పాటు పోషకాలను అందిస్తాయి. వీటిలో ముఖ్యంగా నీరు, కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, పీచు పదార్థాలు వంటివి ఎక్కువగా ఉంటాయి. ఇవి మనిషి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

–స్వప్నరెడ్డి, వైద్యాధికారిణి, సీతారామపురం పీహెచ్‌సీ

వేసవి తాపాన్ని తీరుస్తాయి

వేసవిలో తాటి ముంజలు తినడం వల్ల వేసవి తాపం తీరుతుంది. శరీరం డీహైడ్రేషన్‌కు గురి కాకుండా చేసి వడదెబ్బ బారిన పడకుండా రక్షణ కల్పిస్తాయి శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను తాటి ముంజలు నివారిస్తాయి.

– మాలకొండయ్య, సీతారామపురం

వ్యక్తిగత విమర్శలు తగవు

ఆత్మకూరు: రాజకీయ నాయకులపై వ్యక్తిగత విమర్శలు, దుర్భాషలాడడం వంటివి సబబు కాదని ఆత్మకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు సోమవారం రాత్రి ఓ సంయుక్త ప్రకటనలో ఖండించారు. చేజర్ల మండలం పాతపాడుకు చెందిన రాజీవ్‌రెడ్డి చేసిన వ్యక్తిగత విమర్శలతో కూడిన వీడియోను ఖండిస్తున్నామని, అతనిని పార్టీ నుంచి బహిష్కరిస్తున్నామని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పోరాటాలు సాగించాల్సిన తరుణమిదని వారు పేర్కొన్నారు. ప్రజాక్షేత్రంలో ప్రజల తరఫున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని, హామీల అమలుకు డిమాండ్ చేస్తామన్నారు.

సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు



సోమశిల: ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను అందజేస్తోందని వ్యవసాయాధికారి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. అనంతసాగరం మండల వ్యవసాయ కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ యాంత్రీకరణ పథకం కింద సబ్సిడీపై మంజూరు చేసిన వ్యవసాయ యంత్ర పరికరాలను రైతులకు తహసీల్దార్ వై సుభాషిణి చేతుల మీదుగా సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ 9 స్ప్రేయర్లు, 6 కల్టివేటర్లు, ఒక రొటోవేటర్‌ను సబ్సిడీపై రైతులకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు.

విద్యతో ఉన్నత శిఖరాలు



తెలుగు ఉపాధ్యాయిని దంపతులకు సత్కారం

వరికుంటపాడు: విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఎంఈఓ-2 రమణయ్య పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వార్షికోత్సవ వేడుకలను హెచ్‌ఎం డీ వీరభద్రయ్య ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ-2 రమణయ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి చదివి అందుకుని తల్లిదండ్రులు, గురువులకు మంచిపేరు తేవాలన్నారు. విద్యార్థులు సేవాభావాన్ని అలవర్చుకోవాలన్నారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం పాఠశాలలో భోజనశాల నిర్మాణానికి కృషి చేసిన తెలుగు ఉపాధ్యాయిని సుభద్ర దంపతులను సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వక్ఫ్ స్థలాల ఆక్రమణదారులకు నోటీసులు



ఆక్రమణదారులకు నోటీసులు అందజేస్తున్న వక్ఫ్ ఇన్‌స్పెక్టర్ కుదావన్

ఆత్మకూరు: మున్సిపల్ పరిధిలోని వక్ఫ్ స్థలాలను ఆక్రమించిన వారికి నోటీసులు అందజేసినట్లు జిల్లా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ కుదావన్ తెలిపారు. పట్టణంలోని సుల్తాన్‌షాహీద్ దర్గా స్థలాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో సర్వే నంబరు 844లోని 3.70 ఎకరాల వక్ఫ్ స్థలాన్ని సుమారు 80 మంది ఆక్రమించినట్లుగా గుర్తించామన్నారు. వక్ఫ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వక్ఫ్‌యాక్ట్ 54/1 మేరకు ఆక్రమణదారులకు నోటీసులు అందజేస్తున్నామని తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆక్రమణదారులపై తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట ఆత్మకూరు వక్ఫ్ ఉద్యోగి దస్తగిరి బాషా ఉన్నారు.

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ నాగేంద్ర

వరికుంటపాడు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గవదగట్ల వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన మండల సర్వసభ సమావేశం మొక్కుబడిగా జరిగింది. మూడు నెలలకోసారి జరిగే సర్వసభ్య సమావేశానికి అన్ని శాఖల మండలాధికారులు హాజరుకావాల్సి ఉన్నా కొన్ని శాఖల అధికారులు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన శాఖల అధికారులు తమ కింది స్థాయి సిబ్బందిని పంపించారు. ప్రధానంగా రెవెన్యూ, ట్రాన్స్‌కో శాఖల అధికారులు హాజరుకాలేదు. అలాగే 24 మంది సర్పంచ్‌లకు గానూ కేవలం ముగ్గురు మాత్రమే హాజరయ్యారు. తొమ్మిది మంది ఎంపీటీసీలకు గానూ నలుగురు మాత్రమే హాజరయ్యారు. దీంతో మండలాభివృద్ధి, సమస్యలపై చర్చించాల్సిన సర్వసభ్య సమావేశం కాస్తా అభివృద్ధి నివేదికలు చదివి వినిపించడానికి పరిమితమైంది. జెడ్పీటీసీ రావిళ్ల నాగేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వం వివిధ కార్పొరేషన్ల ద్వారా మంజూరు చేస్తున్న సబ్సిడీపై రుణాలపై ప్రజలకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చూడాలని అధికారులను కోరారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. వైద్యా ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ జీ వేణుగోపాల్‌రావు, వైస్‌ఎంపీపీ దేవనబోయిన మధు, వైద్యాధికారిణి కరీష్మా, సీడీపీఓ సునీత,ఎంఈఓ రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి



ఏఎస్‌పేటలో మట్టి నమూనాల సేకరణ

కొండాపురం: రైతులు వరి సాగుకు బదులు ప్రత్యామ్నాయ పంటలైన పెసర, మినుము, తదితర మెట్ట పంటలను సాగుచేసుకోవాలని కొండాపురం వ్యవసాయాధికారి షేక్ సైదా సూచించారు. మండలంలోని వెలిగండ్ల, గుడవళ్లూరు పంచాయతీల్లో భూసార పరీక్షలకు మట్టిన మూనాల సేకరణను సోమవారం ప్రారంభించారు. భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలను సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఎరువుల పెట్టుబడులను తగ్గించుకోవచ్చని వివరించారు. ప్రతి రైతు భూసార పరీక్షలు తప్పక చేయించుకోవాలని కోరారు. ఆయన వెంట ఏఈఓ నవీన్, వ్యవసాయ సిబ్బంది ఉన్నారు.

అనుమసముద్రంపేట: అనుమసముద్రం, ఏఎస్‌పేట గ్రామాల్లో భూసార పరీక్షలపై ఏఓ టీ రజని అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్‌లో పంట మార్పిడి పాటించి వరికి బదులుగా మినుము, పెసలు, అలసంద, మొక్కజొన్న వంటి ప్రత్యామ్నాయ పంటలను వేసుకోవాలని సూచించారు. పంట మార్పిడితో నేలలో పోషకాల సమతుల్యత జరిగి తెగుళ్లు, కీటకాలను అదుపు చేయడం సులభంగా ఉంటుందని తెలిపారు. ఏఈఓలు కే చిరంజీవి, వై భాగ్యలక్ష్మి, వీఏఏ శ్రీహరి, రైతులు పాల్గొన్నారు.

సీతారామపురం : స్థానిక రైతు సేవా కేంద్రంలో వీఏఏలతో మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి సమావేశం నిర్వహించారు. భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. మండలంలో 420 మట్టి నమూనాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఏఈఓ సాంబయ్య పాల్గొన్నారు.

మర్రిపాడు: మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో భూసార పరీక్షలపై ఏఓ ఎస్ రామమోహన్ వీఏఏలకు అవగాహన కల్పించారు. మట్టి నమూనాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి ప్రాముఖ్యతను వివరించారు. రైతులను చైతన్యవంతం చేసి భూసార పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు.

ఆత్మకూరు(చేజర్ల): చేజర్లలోని రైతుసేవా కేంద్రంలో భూసార పరీక్షలపై వీఏఏలకు ఏఓ వీ శశిధర్ అవగాహన కల్పించారు. మండలంలో 810 మట్టి నమూనాలను సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రైతులను చైతన్యవంతం చేసి ప్రతి రైతుసేవా కేంద్రం పరిధిలోని 50 నుంచి 60 మట్టి నమూనాలు సేకరించాలని సూచించారు. అనంతరం ప్రత్యామ్నాయ పంటలు, పంట మార్పిడితో కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. ఉద్యాన అధికారిణి లక్ష్మి పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని నిరసన



సీతారామపురం : పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఎం ఉదయగిరి ప్రాంతీయ కమిటీ కార్యదర్శి కోడె రమణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు పడమటిరొంపిదొడ్ల గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపడం దారుణమన్నారు. ఓవైపు పెరిగిన నిత్యావసర, గ్యాస్ ధరలతో ప్రజలు బెంబేలెత్తుతుంటే, మరోవైపు విద్యుత్ చార్జీలను విపరీతంగా పెంచడం సబబు కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

26న మండల సర్వసభ్య సమావేశం

సీతారామపురం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 26 ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ భాస్కర్ సోమవారం తెలిపారు. ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన జరిగే సమావేశంలో మండలాభివృద్ధిపై సమీక్షించనున్నట్లు చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

ఆత్మకూరు: ఆత్మకూరులోని విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11.30 నుంచి 1.30 గంటల వరకు ప్రత్యేక అదాలత్‌ను నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఐ శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. విద్యుత్ అదాలత్ చైర్‌పర్సన్, విశ్రాంత జడ్జి వీ శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యుడు కే రామమోహన్‌రావు, సాంకేతిక సభ్యులు ఎస్ఎల్ అంజనీ కుమార్, విజయలక్ష్మి హాజరవుతారని చెప్పారు. ఆత్మకూరు, ఉదయగిరి, కలిగిరి సబ్‌డివిజన్ల పరిధిలోని వినియోగదారులు తమ సమస్యలను రాతపూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.280

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో సోమవారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.280 పలికింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 445 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, 289 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ. 220, సగటున రూ.259.61 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి వీ మహేష్‌కుమార్ తెలిపారు.

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో సోమవారం 419 పొగాకు బేళ్లను కొనుగోలు చేసినట్లుగా వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. రైతులు వేలానికి 542 బేళ్లు తీసుకురాగా, 419 బేళ్లను కొనుగోలు చేశారని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.220, సగటున రూ.263.65 ధర పలికిందని వివరించారు.

యూటీఎఫ్ ప్రచారం

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలం ఆదూరుపల్లి, చిత్తలూరు గ్రామాల్లో యూటీఎఫ్ ఉపాధ్యాయుల బృందం సోమవారం ఇంటింటి ప్రచారం చేపట్టింది. ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులను కలుసుకుని ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యాబోధన తీరును వివరించి పిల్లలను చేర్పించాలని కోరారు.

దామిశెట్టికి కన్నీటి వీడ్కోలు



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి

కావలి: గుండెపోటుతో మరణించిన పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దామిశెట్టి శ్రీనివాసులునాయుడు అంత్యక్రియలను ఆయన స్వగ్రామమైన కావలి రూరల్ మండలం సర్వాయపాళెంలో సోమవారం నిర్వహించారు. ఆయన అంతిమయాత్రలో కుటుంబసభ్యులు, ప్రముఖులు పాల్గొని కన్నీటి వీడ్కోలు పలికారు. పట్టణంలోని వాయునందన ప్రెస్‌రోడ్‌లోని నివాసంలో ఉంచిన దామిశెట్టి భౌతికకాయాన్ని ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆమంచి కృష్ణమోహన్, వివిధ రాజకీయపార్టీల నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దామిశెట్టి కుమారులు సురేష్‌బాబు, సుదీనాయుడుకు సానుభూతి తెలిపారు. అనంతరం దామిశెట్టి అంతిమయాత్రలో పాల్గొని ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.

గ్రావెల్ అక్రమ తరలింపు అడ్డగింత



అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామంలోని నల్లకొండ నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్న వారిపై ఎమ్మెల్యే కాకర్ల సురేష్ కన్నెర్ర చేశారు. తన అనుమతి లేకుండా గ్రావెల్‌ను తరలిస్తున్న విషయం తెలుసుకున్న ఆయన స్వయంగా ఘటనా స్థలం వద్దకు చేరుకుని గ్రావెల్ అక్రమ రవాణాను సోమవారం అడ్డుకున్నారు. అక్కడ ఉన్న ఒక ఇటాచీతో పాటు నాలుగు ట్రాక్టర్లు, రెండు టిప్పర్లను స్వాధీనం చేసుకుని రెవెన్యూ, పోలీసు యంత్రాంగానికి అప్పగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఓ వ్యక్తి నల్లకొండ గ్రావెల్‌పై కన్నేశారు. నల్లగొండ్లలో ఉన్న గృహమల్లేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధికి గ్రామరాశి కింద కొంత సొమ్ము ఇచ్చేటట్లు, గ్రామంలో ఉన్న రాజకీయ పెద్దలకు కూడా కొంత ఇచ్చేలా ఒప్పందం చేసుకుని యంత్రాలను వినియోగించి భారీ ఎత్తున గ్రావెల్‌ను బయటప్రాంతాలకు తరలిస్తున్నట్లుగా సమాచారం. అయితే గ్రావెల్ దందాలో తమను పట్టించుకోకపోవడంతో అధికార పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌కు ఫిర్యాదు చేశారని తెలిసింది. దీంతో ఎమ్మెల్యే రంగంలోకి దిగి దందాను అడ్డుకున్నట్లుగా స్థానికులు చర్చించుకుంటున్నారు. ఈ విషయమై తహసీల్దార్ హమీద్ మాట్లాడుతూ గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తుండగా వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, చట్టపరమైన చర్యల కోసం పోలీసులకు అప్పగించామని తెలిపారు.

సీఎం పర్యటనకు ఏర్పాట్ల పరిశీలన



హెలిప్యాడ్‌కు స్థల పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూరు: సీఎం చంద్రబాబునాయుడు మే 1న ఆత్మకూరులో పర్యటించనున్నారనే సమాచారంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు సోమవారం ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్డీఓ బీ పావని, డీఎస్పీ కే వేణుగోపాల్ బైపాస్‌రోడ్డులోని అభయాంజనేయ స్వామి ఆలయం సమీపంలో ఉన్న హెలిప్యాడ్ ను పరిశీలించారు. కాగా సీఎం పర్యటన ఏర్పాట్లపై నెల్లూరులో ఆర్డీఓ, తహసీల్దార్లతో కలెక్టర్ సమీక్షించినట్లు సమాచారం. సీఎం పూర్తి స్థాయి షెడ్యూల్‌ను త్వరలో ప్రకటించనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి



పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న ముస్లింలు

కావలి: వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ముస్లిం మైనార్టీ నాయకులు డిమాండ్ చేశారు. వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో కావలిలో సోమవారం ముస్లింలు శాంతియుతంగా నిరసన ప్రదర్శన చేపట్టారు. ముస్లిం మతపెద్దలు, మైనార్టీ నాయకులు, మహిళలు జాతీయ, నల్ల జెండాలు, ప్లకార్డులు పట్టుకుని స్థానిక జెండా చెట్టు సెంటర్ నుంచి ఆర్డీఓ కార్యాలయం వరకు ప్రదర్శన సాగించారు. మతసామర్యాన్ని దెబ్బతీసేలా ఉన్న వక్ఫ్‌సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ముస్లింల హక్కులను కాలరాసేలా వక్ఫ్ చట్టంలో చేసిన సవరణలను ఉపసంహరించుకునే వరకు శాంతియుతంగా పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. అనంతరం అనంతరం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు.

పొలం బాటపై వివాదం



బాట విషయంలో గొడవ పడుతున్న ఇరువర్గాలు

ఆత్మకూరురూరల్: మండలంలోని గొల్లపల్లిలోని బొగ్గేరు సమీపంలోని పొలాలకు బాట ఏర్పాటు విషయంలో సమీప బంధువులైన ఈగా లక్ష్మిరెడ్డి, పాలేటి వెంగళరెడ్డి కుటుంబాల మధ్యన సోమవారం వివాదం తలెత్తింది. తమ పట్టా భూముల్లోకి రాకపోకలు సాగించేందుకు వీలుగా ఒక వర్గం వారు ప్రభుత్వ పొరంబోకు భూమిలో బాట ఏర్పాటుకు జేసీబీతో చదును చేస్తుండగా, మరొక వర్గం వారు అడ్డుకోవడంతో వివాదం నెలకొంది. ఓ దశలో వివాదం కాస్తా ఉద్రిక్తతకు దారితీయగా స్థానిక వీఆర్వో హరిబాబు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పారు. ఉన్నతాధికారులు తదుపరి చర్యలు తీసుకునే వరకు వివాదం తలెత్తిన భూముల్లో ఎలాంటి పనులు చేపట్టవద్దని హెచ్చరించారు. దీంతో సమస్య తాత్కాలికంగా సర్దుమణిగింది.